సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం ‌। 11 । ఏప్రిల్ । 2023



ఆశాదీపం వైఎస్ జగన్
కొల్లేరు ప్రజల ఆశాదీపంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి కనిపిస్తున్నారని ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ అన్నారు. 8లో



మద్యం మత్తులో..
మద్యం మత్తులో కాలుజారి చేపల చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన పిప్పరలో చోటుచేసుకుంది. 8లో

శ్రీవారికి కాసుల పంట
ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) దేవస్థానం వార్షిక ఆదాయం రూ.131 కోట్లకు చేరింది. 2022–23లో రూ.131,33,37,913 సమకూరింది. 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సహరి (బుధవారం తెల్లవారుజాము)
భీమవరం	6.25	4.29
తాడేపల్లిగూడెం	6.27	4.38
నరసాపురం	6.25	4.28

సహకారం.. స్వాహాపర్వం

ప్రభుత్వం కన్నెర్ర
- నకిలీ షూరిటీలతో భారీగా రుణాలు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఉమ్మడి జిల్లాలోని ఆరు శాఖల్లో అక్రమాలు
- నాబార్డు వార్షిక తనిఖీలో వెలుగులోకి..
- ఉన్నత స్థాయి అధికారితో విచారణ
- 17 మంది అధికారులపై చర్యలకు సిఫార్సు



సాక్షి ప్రతినిధి,ఏలూరు: సహకార చట్టంలోని బ్యాంకుల నిబంధనలను పాటించలేదు.. రుణపరిమితిని అడ్డగోలుగా ఇష్టానుసారంగా పెంచేశారు.. సరైన షూరిటీలు లేకుండా కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేశారు. అర్హులైన రైతులకు ఇవ్వాల్సిన రుణాలను పక్కదారి పట్టించి మద్యం వ్యాపారులతో సహా పలువురికి కట్టబెట్టారు. ఇదంతా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలోని బ్రాంచీల్లో జరిగిన అవినీతి పర్వం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డీసీసీబీ పరిధిలోని ఆరు శాఖల్లో జరిగిన భారీ అవకతవకలపై ప్రభుత్వం కన్నెర్ర చేసింది. సమగ్ర విచారణ నివేదిక ఆధారంగా గతంలో పనిచేసిన ఉన్నతాధికారులందరిపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గతంలో పనిచేసిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో పాటు మేనేజర్ కేడర్‌లోని 17 మందిపై చర్యలు తీసుకోనున్నారు.

రుణాల మంజూరు విషయంలో..

జిల్లాలోని డీసీసీబీ పరిధిలోని పలు బ్రాంచీల్లో ఏళ్ల తరబడి రుణాల మంజూరు విషయంలో భారీగా అవకతవకలు జరిగాయి. వివాదాల్లో ఉన్న భూములను బ్యాంకుల్లో షూరిటీగా చూపించి కోట్ల రూపాయల రుణాలు పొంది తిరిగి రూపాయి కూడా చెల్లించని ఘటనలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని యలమంచిలి, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, ఏలూరుతో పాటు మరికొన్ని బ్రాంచీల్లో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం గుంటూరు కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. సుదీర్ఘంగా సాగిన విచారణ అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీనిపై కో–ఆపరేటివ్ శాఖ కమిషనర్ ఎ.బాబు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

అక్రమాల్లో కొన్ని..

- యలమంచిలి బ్రాంచీలో వివాదాలతో ఉన్న ఆస్తులను షూరిటీలుగా చూపించి రూ.33.22 కోట్ల రుణం మంజూరు చేశారు. దీనిలో రూ.13.86 కోట్లు ఇప్పటికీ రికవరీ కాలేదు. అలాగే 2015–16, 2017–18 నాబార్డు వార్షిక తనిఖీల్లో నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించి రుణాలు మంజూరు చేసినట్లుగా నిర్ధారించారు. ఎలాంటి షూరిటీలు లేకుండా రుణాలు మంజూరు చేసి బ్యాంకుకు ఆర్థిక నష్టం చేకూర్చారు.
- **తాడేపల్లిగూడెం బ్రాంచీలో 104 మంది సభ్యుల పేరుతో రూ.2.80 కోట్లను ఓ రియల్టర్‌కు రుణంగా ఇచ్చారు. తాడేపల్లిగూడెంలోని డీసీసీబీ బ్రాంచీలో మొత్తం బకాయిల విలువ రూ.11.69 కోట్లు కాగా 559 రుణాలు విలువ రూ.4.30 కోట్లు. వీటి గడువు దాటినా కొన్నింటి వసూళ్లకు** ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- 2012–13 నుంచి 2018–19 వరకు డీసీసీబీ పలు శాఖల ద్వారా రూ.867.19 కోట్ల విలువైన 2,445 బ్యాంకు గ్యారంటీలు జారీ చేసింది. దీనిలో రూ.295.35 కోట్ల విలువైన 23 బ్యాంకు గ్యారంటీలను మద్యం వ్యాపారులు, రైస్‌మిల్లులు, ఇతరులకు ఇచ్చినట్టు గుర్తించారు.
- వ్యవసాయ భూమి విలువ భారీగా పెంచి షూరిటీగా చూపి రుణాలు కూడా మంజూరు చేశారు.

క్రిమినల్ కేసులు

అక్రమాలు జరిగిన క్రమంలో ఆయా కాలంలో పనిచేసిన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులకు సిఫార్సు చేశారు. మేనేజర్లు మన్నె మోహనరావు, ఐవీ నాగేశ్వరరావు, డి.ఆంజనేయులు, టీవీ సుబ్బారావు, కేవీ అజయ్‌కుమార్, జి.పిచ్చయ్యచౌదరి, కె.సురేంద్రప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్.రాధాకృష్ణ, జేఎస్‌వీ సత్యనారాయణరావు, సీహెచ్ రత్నకుమారి, కె.కిరణ్మయి, వి.శ్రీదేవి, డి.రమణ, జనరల్ మేనేజర్లు ఎ.మాధవీమూర్తి, వైవీ రాఘవేంద్రరెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీఎం ఫణి తదితరులపై క్రిమినల్ చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిఫార్సు చేశారు.

ఆక్వా రైతుల ఆనందహేల



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఆక్వా రైతులు

పెనుగొండ: నాన్ ఆక్వాజోన్‌లో ఉన్న అర్హులైన రైతులను ఆక్వాజోన్‌లోకి మార్పు చేసి విద్యుత్ రాయితీ కల్పించేందుకు కృషిచేసిన మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు వెస్ట్ గోదావరి ప్రాన్స్ ఫార్మర్ వెల్ఫేర్ ఫెడరేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తూర్పుపాలెంలో ఆయన్ను కలిసి సత్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తూర్పుపాలెంలో మంత్రి శ్రీరంగనాథరాజు సొంత ఖర్చులతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను కర్ణాటకలోని యాదగిరి జిల్లా చెన్నా మల్లికార్జునరావు స్వామీజీ కలిసి అభినందనలు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ కావడి శివకుమార్ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని, సీఎం జగన్‌ను మరోసారి అధికారంలోకి తీసుకు వస్తామని అన్నారు.

న్యూస్‌రీల్

ఏలూరు జేసీ లావణ్యవేణి బాధ్యతల స్వీకరణ



ఏలూరు(మెట్రో): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బి.లావణ్యవేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆమె కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేను వేగవంతం చేయడం, పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కారం, ముంపు బాధితులను పునరావాస కాలనీలకు తరలింపు, పేదలకు ఇళ్ల స్థలాల అందజేత, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో భాగంగా ఫ్యామిలీ డాక్టర్, నాడు–నేడు తదితర అంశాలతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అన్నిరంగాల్లో జిల్లాను ముందంజలో ఉంచడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని చెప్పారు. ఆమెను జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్‌మూర్తి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజూభార్గవి, డీఎస్‌ఓ ఆర్‌ఎస్ఎస్ రాజు, కలెక్టరేట్ ఏఓ రమాదేవి, ఏలూరు తహసీల్దార్ బి.సోమశేఖర్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

పక్కాగా విద్యాకానుక పంపిణీ



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్యాంసుందర్

వీరవాసరం : పాఠశాల ప్రారంభం రోజే జగనన్న విద్యాకానుక అందించేలా చర్యలు తీసుకున్నట్టు ఏపీసీ శ్యాంసుందర్ అన్నారు. స్థానిక ఎంఆర్‌కే ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను జిల్లా బృందంతో కలిసి పరిశీలించారు. పాఠశాల వారీగా విద్యాకానుక పకడ్బందీగా పంపిణీ చేస్తామన్నారు. స్టాక్ వెరిఫికేషన్ జిల్లా స్పెషల్ ఆఫీసర్ (పాఠ్యపుస్తకాల అభివృద్ధి అధికారి) డి.మాధవీలత మాట్లాడుతూ స్టాక్ పాయింట్లలో గదులను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించామన్నారు. విద్యాకానుక నాణ్యతను మండల ఇంజనీర్, ఏపీఎంలు చూడాలన్నారు. జిల్లా స్టాక్ పాయింట్ శృంగవృక్షం ఉన్నత పాఠశాల, కాళ్ల, వీరవాసరం మండల స్టాక్ పాయింట్లను పరిశీలించామన్నారు. ఎంఈఓ బి.వినాయకుడు, ఎంఆర్‌కే హైస్కూల్ హెచ్‌ఎం బి.ప్రభా మంజరి, డేటా ఎంట్రీ ఆపరేటర్ మద్దాల యశోద సత్య సీఆర్పీలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనానికి ప్రాధాన్యం



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న సమన్వయకర్త కృష్ణారావు

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని జిల్లా మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త కె కృష్ణారావు అన్నారు. సోమవారం మంచిలి జెడ్పీ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట తయారీ విధానం, వంట సామగ్రి, బియ్యం, గుడ్లు, చిక్కీల నిల్వ, రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. ఇక్కడ రెండు పాఠశాలలు నాడు–నేడులో అభివృద్ధి చేశారన్నారు. రక్తహీనత నివారణకు ఉపయోగించే ఐరన్ మాత్రలు, రాగిజావ పంపిణీ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు వారానికి 5 రోజులు గుడ్లు, 3 రోజులు చిక్కీలు, మూడు రోజులు రాగిజావ అందిస్తామన్నారు. దీని వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరి చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. హెచ్‌ఎంలు కేవీ రామారావు, జి.సుధాకర్, సీఆర్పీ డీఎస్ ప్రసాదు, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రశాంతి



భీమవరం కలెక్టరేట్‌లో స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనలో అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినతుల పరిష్కారం అర్జీదారులుకు సంతృప్తి కలిగించేలా ఉండాలన్నారు. అర్జీలు తిరిగి రీ ఓపెన్ అయ్యే అవకాశం లేకుండా పరిష్కారించాలని, ఒకే సమస్యపై రెండోసారి స్పందనలో ఫిర్యాదు రాకుండా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో అధికారులు సమస్యను పరిష్కరిస్తే జిల్లాస్థాయి స్పందనకు అర్జీదారులు రావాల్సిన అవసరం ఉండదన్నారు. మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. రోజూ పది నిమిషాల పాటు స్పందన అర్జీలకు సమయం కేటాయించాలన్నారు. స్పందన కార్యక్రమంలో 178 దరఖాస్తులు వచ్చాయని వాటిని వేగంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీవీ కేసీహెచ్ అప్పారావు, భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంతి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ధాన్యం కొనుగోలు, గ్రామ, వార్డు వలంటీర్లకు సన్మానం, రీ సర్వే, జగనన్న గృహ నిర్మాణాలపై ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గృహ నిర్మాణాల్లో ప్రతిరోజూ స్టేజ్ కన్వర్షన్ జరగాలన్నారు. వచ్చేవారం జిల్లాలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో హౌసింగ్ లేఅవుట్లు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు మౌలిక వసతులు కల్పించాలన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం

జిల్లాలో ఇబ్బందులు లేకుండా రబీ ధాన్యం సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలన్నారు. 100 కిలోలు కామన్ రకం రూ.2,040, ఏ గ్రేడ్ రకం రూ.2,060, 75 కిలోల కామన్ రకం రూ.1,530, ఏ గ్రేడ్ రకం రూ.1,545 చొప్పున కొనుగోలు చేస్తామన్నారు. సంచులు, హమాలీలు, రవాణాకు వాహనాలను సమకూర్చుకుంటే ప్రభుత్వం బిల్లులు అందిస్తుందన్నారు. గోనె సంచుకు రూ.3.39 పైసలు, హమాలీ చార్జీ టన్నుకు రూ.220, ధాన్యం రవాణాకు 8 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.324 చొప్పున చెల్లిస్తామన్నారు.

14న వలంటీర్లకు సత్కారం

ఈనెల 14న జిల్లాలో గ్రామ, వార్డు వలంటీర్ల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. వలంటీర్లకు మూడు విభాగాలుగా అవార్డులు అందిస్తామన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ

జిల్లాలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా విభజన అనంతరం జిల్లాకు 273.14 ఎకరాల వక్ఫ్ ఆస్తులను లెక్కించారని, వీటిలో ఎక్కువగా ఆక్రమణకు గురైనట్టు గుర్తించామన్నారు. జిల్లాలో 26 మసీదులు, 19 పీర్ల పంజాలు, 5 దర్గాలు, 4 ఈద్గాలు, ఒక సత్రం, ఒక ఆస్థాన మొత్తం 56 సంస్థలు ఉన్నాయన్నారు. వక్ఫ్ ఆస్తులను అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉందని, అద్దెలను పునః సమీక్షించి ఆదాయం పెంపునకు కృషిచేయాలన్నారు.

రైస్‌మిల్లర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



రైస్‌మిల్లర్లతో చర్చిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుపక్ష ప్రభుత్వమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని రైస్‌మిల్లర్లతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. రానున్న ధాన్యం ప్రొక్యూర్‌మెంట్‌కు సంబంధించి రైస్‌మిల్లర్ల సమస్యలపై చర్చించారు. రైస్ మిల్లర్లు మాట్లాడుతూ 1:1గా ఉన్న గ్యారంటీని 2:1గా కేటాయించాలని మంత్రి కొట్టును కోరారు. గతం నుంచి తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ గోదాముల్లో క్లియర్ చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు కావడంతో రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్నాయని, సరిపడా ధాన్యం ప్రొక్యూర్‌మెంటు కావడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సమీపంలో ఉన్న మండలాలను తాడేపల్లిగూడెం పరిధిలోకి చేర్చాలని కోరారు. అలాగే పలు సమస్యలపై మొరపెట్టుకున్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారం దిశగా పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో ఫోనులో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. తక్షణమే రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి కారుమూరి తెలిపారు. రైతులకు, మిల్లర్లకు లాభదాయకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ ప్రశాంతితో మంత్రి కొట్టు ఫోనులో చర్చించారు. రబీ సీజన్‌లో రైతులకు, ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికార యంత్రాంగం సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. వ్యవసాయ శాఖ ఏడీ మురళీకృష్ణ, ఏఓ ప్రసాద్, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నాయకులు బుర్ర శ్రీను, గ్రంధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

97.57 శాతం విద్యార్థుల హాజరు

సాక్షి, భీమవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ఎటువంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. గణితం పరీక్షకు 97.57 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. 22,988 మంది విద్యార్థులకు 22,429 మంది హాజరయ్యారని 34 పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించగా పరీక్షల సహాయ కమిషనర్ రెండు కేంద్రాలను తనిఖీ చేసినట్టు చెప్పారు.

ఫిర్యాదులపై సత్వర విచారణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

సాక్షి, భీమవరం: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై సత్వరమే చట్టప్రకారం విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అడిషినల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో 16 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. కట్నం వేధింపులు, సరిహద్దు గొడవలు, సివిల్ వివాదలపై ఎక్కువగా ఫిర్యాదులు ఉన్నాయి. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎస్పీ సుబ్బరాజు సూచించారు.

- గుర్తుతెలియని వ్యక్తి తన ఇంట్లో ఉండే ఫోన్‌కి కాల్ చేసి వేధిస్తున్నాడని ఉండికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తమ దూరపు బంధువు సొమ్ములు తీసుకుని మోసం చేశారని తాడేపల్లిగూడేనికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.
- తన ఇంట్లో ఆరు నెలల క్రితం చోరీ జరగ్గా ఇప్పటివరకూ దొంగలను పట్టుకోలేదని పోడూరు మండలానికి చెందిన మహిళ ఏఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు.

ఆకట్టుకున్న గొల్లభామ



ఆకులో ఆకునై అన్నట్టు.. ఎండిన ఆకులు, సన్నని తీగ మాదిరి శరీరాకృతితో గొల్లభామ ఆకట్టుకుంది. సోమవారం కొయ్యలగూడెంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాల్ గార్డెన్‌లో ఇలా కనిపించింది.

– కొయ్యలగూడెం

గుండెల నిండా అభిమానం



సంక్షేమ ప్రదాతకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారు.. గుండెల నిండా అభిమానం చాటుతున్నారు. 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా తమ ఇంటికి వస్తున్న ప్రజాప్రతినిధులకు సాదర స్వాగతం పలుకుతున్నారు. దీంతో గృహసారథులు, పార్టీ నాయకులు ఉత్సాహంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో గృహసారథి చిలకపాటి మేరీ రత్నం తన మోటార్‌సైకిల్‌పై సీఎం జగన్ స్టిక్కర్‌తో పర్యటిస్తున్న దృశ్యమిది.

– పాలకొల్లు అర్బన్

టీడీపీ ఎమ్మెల్యే తీరుపై మండిపాటు

రోడ్డుపై బైఠాయించిన అదే పార్టీ మాజీ సర్పంచ్



రోడ్డుపై బైఠాయించిన టీడీపీ మాజీ సర్పంచ్ బచ్చు కృష్ణ

ఆకివీడు : సమస్యలు పరిష్కరించలేని ఎమ్మెల్యే ఎందుకు.. ధర్నాలు చేయడానికేనా అంటూ టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ బచ్చు కృష్ణ సొంత పార్టీ ఎమ్మెల్యే తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన ఘటన సోమవారం జరిగింది. ఆకివీడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈ ఉదంతం చోటుచేసుకుంది. విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా చేసేందుకు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి కొద్దిసేపు నినాదాలు, ప్రసంగాలు ఇచ్చి వెళ్లిపోయిన ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రవర్తనపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు, అజ్జమూరు గ్రామ మాజీ సర్పంచ్ బచ్చు కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకుడు మాకు ఎందుకు అంటూ ఆగ్రహం వ్యక్తం చేసి, సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన టీడీపీ మండల అధ్యక్షుడు మోటుపల్లి ప్రసాద్, ఆ పార్టీ నేతలు పిన్నమరాజు శ్రీనివాసరాజు, గంధం ఉమ, అజ్మల్ తదితరులు ఈ విషయం తెలుసుకుని కంగుతిన్నారు. వెంటనే వారు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి కృష్ణను సముదాయించే ప్రయత్నం చేశారు. నిరసన విరమించాలని సూచించారు. ఈ సందర్భంగా బచ్చు కృష్ణ మాట్లాడుతూ అజ్జమూరులో విద్యుత్ షాక్‌కు గురై గతంలో ఓ బాలుడు మృతిచెందాడని, ఇటీవల ఓ మహిళ తీవ్రంగా గాయపడిందని, బాధితులను పరామర్శించడంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ సమాచారం అందుకున్న ఎమ్మెల్యే రామరాజు సోమవారం సాయంత్రం బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

1998 డీఎస్సీ అభ్యర్థులకు 12న కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఎస్సీ 1998కి సంబంధించిన అభ్యర్థుల్లో కనీసపు టైమ్ స్కేల్‌లో పనిచేయడానికి క్యారీ ఫార్వర్డ్ అయిన 274 పోస్టుల్లో నియామకం కోసం వెబ్‌సైట్‌లో మెరిట్ ప్రాతిపదికన 274 మంది అభ్యర్థుల వివరాలను డీఈఓ వెబ్‌సైట్లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవి సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో తెలియపరిచిన అభ్యర్థులు తప్పనిసరిగా ఈనెల 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఏలూరు జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ అర్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, 1998 డీఎస్సీ హాల్‌టికెట్‌తో రావాలని కోరారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో చెరువులో పడి వ్యక్తి మృతి


బస్సాన్‌దాస్ మృతదేహం

గణపవరం: మద్యం మత్తులో కాలుజారి చేపల చెరువులో పడి ఒక యువకుడు మరణించిన సంఘటన పిప్పరలో జరిగింది. గణపవరం ఎస్సై వేముల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం మండలం చిలకంపాడు గ్రామానికి చెందిన పాండ్రంకి వెంకన్నకు పిప్పర గ్రామంలో చేపల చెరువు ఉంది. చెరువు వద్ద ఆరునెలలుగా అస్సాం రాష్ట్రానికి చెందిన బస్సాన్‌దాస్(45) పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. ఉదయం దాస్ మృతదేహాన్ని చూసి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటేశ్వరరావు మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినవెంకన్న వార్షిక ఆదాయం రూ.131 కోట్లు

- 2021-2022 కంటే రూ.2.55 కోట్లు పెరిగిన ఆదాయం
- రూ.11.92 కోట్లు పెరిగిన నికర వార్షిక ఆదాయం





ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి (చినవెంకన్న) వార్షిక ఆదాయం రూ.131 కోట్లకు చేరింది. 2019 తర్వాత రెండేళ్ల పాటు కోవిడ్ కారణంగా శ్రీవారి ఆదాయం గణనీయంగా తగ్గింది. ఆ తరువాత 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ముందెన్నడూ లేనివిధంగా స్వామివారికి రూ.128,77,75,411 ఆదాయం లభించగా, 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 131,33,37,913 ఆదాయం సమకూరింది. 2021-2022తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో రూ. 2,55,62,502 ఆదాయం పెరిగింది. ఇదిలా ఉంటే దేవస్థానం ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులు పోగా 2021-2022 నికర ఆదాయం రూ. 57,16,25,467 కాగా, 2022-2023 నికర ఆదాయం రూ.69,08,86,656గా ఉంది. దీని ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో స్వామివారి నికర ఆదాయం రూ. 11,92,61,189 పెరిగింది.

అభివృద్ధితో పాటు పెరుగుతున్న ఆదాయం

శ్రీవారి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్న విధంగానే స్వామివారి ఆదాయం కూడా అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో స్వామివారిని దాదాపు 25 నుంచి 40 వేల మందికి పైగా, అలాగే సాధారణ రోజుల్లో 5 నుంచి 12 వేల మందికి పైగా భక్తులు దర్శిస్తున్నారు. పెద్ద తిరుపతి వెంకన్న మొక్కులను ఇక్కడ తీర్చుకోవచ్చనే సంప్రదాయం ఉండటంతో తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన యాత్రికులు సైతం ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. వీఐపీల తాకిడి కూడా పెరిగింది. క్షేత్రంలో భక్తులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. అభివృద్ధి పనులు సైతం శరవేగంగా జరుగుతున్నాయి. దాతలు కాటేజీల నిర్మాణం, డోనార్‌స్కీం, శాశ్వత నిత్యాన్నదానం, గోసంరక్షణ, విమాన గోపుర స్వర్ణమయ పథకాలకు, ప్రాణదాన ట్రస్టుకు విరివిగా విరాళాలను అందజేస్తున్నారు.

శ్రీవారి వార్షిక నికర ఆదాయ వివరాలు

విభాగం	2021-2022 (రూ.కోట్లలో)	2022-2023 (రూ.కోట్లలో)	పెరిగిన ఆదాయం (రూ.కోట్లలో)
హుండీల నుంచి	31,93,95,423	35,08,11,040	3,14,15,617
గదులు, సత్రాలు, కాటేజీలు ఇతర అద్దెలు	3,11,93,926	3,54,96,387	41,52,357
ప్రసాదాల విక్రయాలు	16,59,06,713	17,73,55,982	1,23,13,629
దర్శనం, ఆర్జిత సేవలు	12,55,19,222	16,28,99,627	3,73,80,405
కానుకలు, వివాహ శుభకార్యాలు	84,30,129	1,40,74,667	56,44,538

ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌కు సౌర వెలుగులు

పూర్వ విద్యార్థుల సాయంతో ప్లాంట్ ఏర్పాటు


హైస్కూల్ పైన ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్

నూజివీడు: 130 ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌కు సోలార్ విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. 1973-74 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి తాము చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయాలనే లక్ష్యంతో సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కల్పించారు. దీని ఏర్పాటుకు మొత్తం రూ.4 లక్షలు వ్యయం కాగా హైస్కూల్ పైభాగంలో సోలార్ పలకలను ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాఠశాలకు విద్యుత్ అంతరాయం ఇక నుంచి ఉండదు. రెండు నెలల క్రితం సోలార్ విద్యుత్ ప్లాంట్ పాఠశాలకు అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి పాఠశాలకు కరెంటు కష్టాలు తొలగిపోయాయి. హైస్కూల్‌లో మొత్తం 30 గదులున్నాయి. ఈ గదుల్లో లైట్లు వెలగాలన్నా, ఫ్యాన్లు వెలగాలన్నా కరెంటు వాడకం ద్వారా నెలకు విద్యుత్ బిల్లు రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు వస్తోంది. ఇక నుంచి ఈ మొత్తం ఆదా కానుంది. ఈ పాఠశాలలో నాడు-నేడు పథకం మొదటి విడతలో రూ.కోటితో మౌలిక సదుపాయాలను కల్పించారు. తాజాగా నాడు-నేడు రెండో విడతలో భాగంగా రూ.1.50 కోట్లతో అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నారు. 1973-74 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి 5 కేవీ సామర్థ్యం కల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ గ్రిడ్‌తో అనుసంధానం చేశారు. ఉత్పత్తి అయిన సోలార్ విద్యుత్‌ను ఏపీసీపీడీసీఎల్ తీసుకోవడంతో పాటు వాళ్ల విద్యుత్‌ను హైస్కూల్‌కు ఇస్తారు. సెలవు రోజుల్లో ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను విద్యుత్ శాఖ తీసుకుని యూనిట్‌కు రూ.4.65 పైసలు చెల్లిస్తుంది.

కొల్లేరు ప్రజల ఆశాదీపం వైఎస్ జగన్

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ


కొల్లేరు భూములపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: కొల్లేరు ప్రజల ఆశాదీపంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కనిపిస్తున్నారని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. ఏలూరు కలెక్టరు కార్యాలయంలో మంగళవారం కలెక్టరు అధ్యక్షతన అటవీ, రెవెన్యూ ఉన్నతాధికారులతో కొల్లేరు భూములపై కీలక సమావేశం నేపథ్యంలో ఆటపాక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ సమయంలో కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో గెజిట్‌లో నిర్ణయించిన సర్వే నెంబర్లు కాకుండా అదనంగా 7,500 ఎకరాల అదనపు భూమిని ధ్వంసం చేశారన్నారు. పొరపాటున జరిగిన విషయాన్ని అప్పటి కలెక్టరు నవీన్‌మిట్టల్ ఒప్పుకున్నారన్నారు. అదనపు భూముల ధ్వంసం వివరాలు రికార్డులతో సహా తన దగ్గర ఉన్నాయన్నారు. కొల్లేరు అదనపు ధ్వంసం భూముల విషయంలో సీఎం జగన్ ఉన్నతాధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారన్నారు. కొల్లేరు ప్రజలకు కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. కీలక సమావేశంలో సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యపురాజు గుర్రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కేంద్రం నియమించిన ఎంపవర్ కమిటీ ముందు గోచికట్టుకుని తమ కొల్లేరు బతుకులు ఇవని చూపించానని ఎమ్మెల్సీ చెప్పారు. టీడీపీలో 22 సంవత్సరాలు పాలేరుతనం చేశానన్నారు. అణగదొక్కుతున్న తనకు సీఎం జగన్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. తనకు టీడీపీలో అన్యాయం జరిగినప్పుడు లేవని నోర్లు ఇప్పుడు లేస్తున్నాయన్నారు. నియోజకవర్గంలో తన ఫొటోలకు కొందరు నలుపురంగు పూస్తున్నారని, అలాగయితే ఎంతో మంది వివిధ పార్టీలు మారుతున్నారని వారి ఫొటోలపైన నలుపురంగు పూయాలన్నారు. తాను ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయకముందే విమర్శలు చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కొల్లేరు ప్రాంత నియోజకవర్గాలైన కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఉండి నియోజకవర్గాల్లో విజయానికి కృషి చేస్తానని తెలిపారు.


తాడేపల్లిగూడెం: మండలంలోని దండగర్రలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గడపగడపకు సంక్షేమం


ఆకివీడు: సాయి నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి సూచనలు చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఏసీల చోరీపై కేసు

ద్వారకాతిరుమల: ఒక పేపర్ యూనిట్‌లో ఏసీల చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. మండలంలోని లక్ష్మీనగర్‌లోని సింధూర పేపర్ యూనిట్‌లో ఈనెల 9న రెండు ఏసీలు చోరీకి గురయ్యాయి. యూనిట్ సీనియర్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చేసినట్లు ఎస్సై తెలిపారు.

దర్శనం టికెట్ల 'రీ ప్రింట్' స్కాం

ఒక ఉద్యోగి సస్పెన్షన్

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో దర్శనం టికెట్ల రీ ప్రింట్ స్కామ్ సోమవారం బట్టబయలైంది. ఈ వ్యవహారంలో ఒక ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యాడు. వివరాల ప్రకారం.. చినవెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులు ఉత్తర రాజగోపుర ప్రాంతంలో ఉన్న కౌంటర్‌లో రూ. 200 టికెట్లు కొనుగోలు చేశారు. ఆలయంలోకి వెళుతున్న సమయంలో ఆ భక్తుల వద్ద ఉన్న టికెట్లను దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు పరిశీలించారు. ఆ సమయంలో రెండు టికెట్లపై ఒకే సీరియల్ నంబర్ ఉండడాన్ని ఆయన గుర్తించారు. అనుమానం కలిగి మిగిలిన భక్తుల వద్ద టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించగా, అదే తరహాలో మరో రెండు టికెట్లు దర్శనమిచ్చాయి. దాంతో రెండు టికెట్లు ఒరిజినల్, రెండు టికెట్లు డూప్లికేట్ అని తెలుసుకుని, విషయాన్ని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లారు. అయితే కౌంటర్‌లో విధులు నిర్వర్తించే రికార్డ్ అసిస్టెంట్ చిలుకూరి పవన్‌కుమార్ టికెట్ల రీ ప్రింట్‌కు పాల్పడుతున్నట్టు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని, అతడిని సస్పెండ్ చేసినట్టు ఈఓ తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

18 నుంచి ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

సాక్షి, భీమవరం: సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ద్వారా నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 23 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. దీనికి సంబంధించిన హాల్ టికెట్స్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.

12న జిల్లా షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

ఆకివీడు: ఈ నెల 12వ తేదీన సీనియర్ షూటింగ్ బాల్ బాలబాలికల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ కార్యదర్శి వీ.ప్రియాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు సాయంత్రం 3.30 గంటలకు ఆకివీడులోని డాక్టర్ ఎ.ఎస్.ఎన్.రాజు స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు నాగరాజు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని ప్రియాంక వివరించారు.

ఆంజనేయ స్వామి హుండీ చోరీ

చాట్రాయి: మండలంలోని చాట్రాయి ఆంజనేయ స్వామి విగ్రహం కానుకల హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. ఈ విగ్రహం చాట్రాయి-పోలవరం గ్రామాల మధ్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

కొయ్యే మోషేన్‌రాజును కలిసిన రాజేష్‌బాబు


భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుతో రాజేష్‌బాబు

తణుకు అర్బన్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును ది సిటీ ఎస్సీ వోస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ అధ్యక్షుడు, ఏపీ సీటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ కార్యదర్శి పి.రాజేష్‌బాబు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. భీమవరంలోని ఆయన నివాసంలో కలిసి ఉద్యోగుల సమస్యలపై చర్చించినట్లు రాజేష్ తెలిపారు.

స్పందనకు రెండు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి రెండు అర్జీలు అందాయని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్ తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతారాంపేటలో భారీ అన్నసమారాధన


అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని సీతారాంపేటలోని రామాలయం వద్ద ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం భారీ అన్నసమారాధన జరిగింది. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ అన్నసమారాధనను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ ప్రారంభించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి రామారావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వర్తనపల్లి కాశీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా త్రినాథ్, వెలనాటి సత్తిబాబు, వ్యాపారవేత్త గమిని సుబ్బారావు, గరగ ప్రసాద్, బొలిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తాడేపల్లిగూడెం టౌన్, రూరల్ మండలం, పెంటపాడు పరిధిలో పదిహేడు ప్రభుత్వ, జెడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో లెక్కలు పరీక్ష జరగగా 3,726 మందికిగాను 3,643 మంది హాజరైయారు. 83 మంది హాజరు కాలేదు.

జిల్లా జడ్జిని కలిసిన తణుకు బార్ అసోసియేషన్


ఏలూరులో జిల్లా జడ్జి సీహెచ్ పురుషోత్తం కుమార్‌ను కలిసిన కామేష్ తదితరులు

తణుకు అర్బన్: ఏలూరు జిల్లా జడ్జి సీహెచ్ పురుషోత్తం కుమార్‌ను తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ ఆధ్వర్యంలో నూతన కమిటీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తణుకు బార్ అసోసియేషన్‌లో ఉన్న సమస్యలను వివరించగా జిల్లా జడ్జి సానుకూలంగా స్పందించినట్లు కామేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అబ్బిన విజయ్ కుమార్, కేవీవీఎస్ మూర్తి, సీహెచ్ నాగేశ్వరరావు, హెచ్ నాగార్జునదాస్, ఎం.మృత్యుంజయరావు, అనుకుల రమేష్ పాల్గొన్నారు.

మే 28 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణా తరగతులు

సాక్షి, భీమవరం: భీమవరంలో మే 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికే నూతన జాతీయ విద్యా విధానం తీసుకొస్తున్నారని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ విద్యారంగాన్ని పేద వర్గాలకు దూరం చేయడానికే ఎన్ఈపీ విద్యావిధానాన్ని తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు చెల్లబోయిన రంగారావు, ఏఐఎస్ఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్, టి.అప్పలస్వామి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

గ్రామాల్లో జోరుగా జగనన్నే మా భవిష్యత్

అత్తిలి: వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం సోమవారం జరిగింది. సంక్షేమమే ధ్యేయంగా, అవినీతికి తావులేకుండా సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. ప్రతి గడపకు వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వలంటీర్ సేవలు తదితర అంశాలపై లబ్ధిదారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గారపాటి నాగరాజు, ఆకుల చినబాబు, కంకటాల సతీష్, గంటానాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, రంభ సూరిబాబు, సైపు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు గ్రామాల్లో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు, దువ్వ, తేతలి, మండపాక, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, గృహ మిత్రాలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు సచివాలయాల పరిధిలోని ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర .దనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, తేతలి గ్రామంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, రైతు విభాగం ప్రధాన కార్యదర్శి సరెళ్ల కృపావరం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, రాచర్ల సూర్యారావు, మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, దారం శ్రీనులతో పాటు గృహ మిత్రలు, వాలంటీర్లు, మండపాకలో


తేతలిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


గూడెం 11వ వార్డులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఇన్‌ఛార్జ్ కట్టా నాగరాజు తదితరులు


34వార్డులో మా నమ్మకం జగనన్నే కార్యక్రమంలో గుండుబోగుల, కొలుకులూరి తదితరులు

ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్లతో పాటు సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు, వలంటీర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామంలో... తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, గృహ సారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్నే మా భవిష్యత్తు...

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సోమవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలో విశేషంగా నిర్వహించారు. గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఇంటి గుమ్మానికి జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్‌లను అతికించారు. ఈ కార్యక్రమాన్ని మునిసిపాలిటీలోని 34 వార్డుల్లోను ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా స్థానిక 11వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ కట్టా నాగరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ప్రజల వద్ద నుంచి ఆయా వివరాలను సేకరించారు. కట్టా నాగరాజు మాట్లాడుతూ ఇచ్చిన అన్ని హామీలు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని కొనియాడారు. రాజకీయాలకుఅతీతంగా అన్ని వర్గాలకు మేలు చేశారన్నారు. ప్రజలు సైతం రాష్ట్ర ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


వల్లూరుపల్లిలో రెండో వార్డులో ప్రచారం చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ అవతారం, తదితరులు

జగనన్నే ప్రజల నమ్మకం

తాడేపల్లిగూడెం రూరల్: ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు నమ్మకం ఉందని వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు అన్నారు. సోమవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేశారన్నారు. గత నాలుగేళ్ల జగన్ పాలనలో దళారీలకు తావు లేకుండా నేరుగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములు జమ చేశారన్నారు. ఇటువంటి పాలన గతంలో ఏనాడు అమలు కాలేదన్నారు. కొమ్ముగూడెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలిశెట్టి నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీ, కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వీరంపాలెంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, ఎల్.అగ్రహారం గ్రామంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు నీలపాల రామన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శీలంశెట్టి బాలాజీ, కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు. అలాగే, ఆరుగొలను, మాధవరం, జగన్నాథపురం తదితర గ్రామాల్లోనూ జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. గృహ సారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మూడోరోజు.. అదే జోరు

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని వచ్చే ఎన్నికల్లో జగన్‌కే మళ్లీ ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు అన్నారు. స్థానిక 34 వార్డులో మా నమ్మకం జగనన్నే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బోణం విజయనిర్మల, కొలుకులూరి ధర్మరాజు, వట్టి బుజ్జి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే

పెంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ కార్యకర్తలు, గృహసారథులు సోమవారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో జగనన్నే మాభవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలతో మమేకం అయి ప్రభుత్వ పథకాలు సరిగా అందుతున్నాయా లేదా పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు వల్లూరుపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు, రాచర్ల సొసైటీ అధ్యక్షుడు కుంచే సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాలు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి పథకాల లబ్ధిని వివరించారు. గ్రామ ఉపసర్పంచ్ అశోక్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మడిపల్లి పుష్పావతి, ఎస్సీ నాయకులు వసంతాడ జోగేంద్ర, గుండుమోగుల గోవింద అప్పారావు, గ్రామ గృహసారదులు దెయ్యం సత్యనారాయణ, అడబాల సుజాత, శీలంశెట్టి గోవింద్ పాల్గొన్నారు. పెంటపాడు, రాచర్ల, రావిపాడు గ్రామాల్లో ప్రచారాలు నిర్వహించారు.


తణుకులో లబ్దిదారులకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వివరిస్తున్న డాక్టర్ దాట్ల సుందర రామరాజు, గృహసారథులు


తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌ఎంపీపీ కట్టా రంగబాబు


అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగన్ పాలన.. సంక్షేమానికి చిరునామా

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- దండగర్ర గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నది ? లేనిది ? ప్రభుత్వ పనితీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేస్తూ జనం మెచ్చిన నాయకుడిగా రాష్ట్ర చరిత్రలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిలిచిపోతారన్నారు. గత ప్రభుత్వాలను చూసి రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ పాలను చూసి ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. జగన్ పాలన ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ పాలనపై ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందన్నారు. ప్రజల క్షేమం కోరుకోలేని బుద్ధిహీనుడు చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబుకు కొట్టేయడం తప్ప మరేమీ తెలియదన్నారు. ఆ కొట్టేసిన దానిలో ఎల్లో మీడియా వాటా పంచుకుంటూ అభూత కల్పనలను ప్రచురిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు కోసమే ఆ పత్రికలు పనిచేస్తున్నాయని దుయ్యబట్టారు. డైరెక్టర్ బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం ద్వారా సంక్షేమ పథకాల లబ్దిదారులకు వారి ఖాతాలకే సొమ్ములను జమ చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకత తీసుకొచ్చారన్నారు. 95లక్షల మంది ఆడపడుచులను మోసం చేసిన ఉసురు చంద్రబాబును వదలదన్నారు. దీనికి దత్తపుత్రుడు తోడయ్యాడన్నారు. తన పార్టీ భవిష్యత్ కోసం కాకుండా చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడానికి పవన్ పనిచేస్తున్నారన్నారు. పవన్‌కు బీజేపీ మొట్టికాయలు వేస్తుందన్నారు. ప్రధాన ప్రతిపక్షం స్థాయికి రావాలని పవన్‌కు బీజేపీ నాయకులు హితవు పలికారన్నారు. అయితే ఇది పవన్‌కు ఎంత వరకు బుర్రకెక్కుతుందో తెలియడం లేదన్నారు. ఎంత మంది వచ్చినా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎమ్పీటీసీలు వీరమళ్ళ వెంకన్న, మార్లపూడి సుబ్బారావు, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, సచివాలయ కార్యదర్శి అంకం శ్రీరామకృష్ణ, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు, సంపతరావు కృష్ణారావు, ముద్రగడ లలితకుమారి, తమ్మిశెట్టి చుక్కయ్య, యాతం సత్యనారాయణ (పెద్దోడు), గంగారావు, సత్తినీడి కొండలరావు, గట్టి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ఏఎస్ఎంలు, ఆశాలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు


ఉపముఖ్యమంత్రిని కలిసిన నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇస్తానని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణకు పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పటాన్ల గణపతి కృతజ్ఞతలు తెలిపారు. కొట్టు సత్యనారాయణ నివాసం వద్ద సోమవారం ఉపముఖ్యమంత్రిని కలిసి హర్షం ప్రకటించారు. కొట్టు సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపిన వారిలో ఉపాధ్యక్షుడు గుమ్మలూరి శ్రీహరి, గౌరవ సలహాదారుడు బండారు పెద్దిరాజు, సెక్రటరి టి.నరసింహామూర్తి, కోశాధికారి పసుమర్తి శ్రీనివాస్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి సర్వేయింగ్ కీలకపాత్ర

సాక్షి, భీమవరం: దేశ, పారిశ్రామిక ప్రగతికి సర్వేయింగ్ ప్రధాన భూమిక పోషిస్తుందని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు అన్నారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో సోమవారం సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, భీమవరం లోకల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్వేయింగ్‌లో చైన్ సర్వే నుంచి డ్రోన్ సర్వే వరకు ఎన్నో వినూత్నమైన మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన రీసర్వేయింగ్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు.

ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సుజాత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల వ్యవధిలో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాంకు డిగ్రీ, డేటా ఎంట్రీ కోర్సుకు 10వ తరగతి, బ్యూటీ కోర్సు(మహిళలు)కు 5వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 90 శాతం హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి కూలీలకు పని ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఉపాధి పని ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా పని ప్రాంతంలో మంచినీరు, టెంట్లు, పనిముట్లు ఏర్పాటు చేయాలన్నారు. 200 పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పీలా గాదినాయుడు, పిన్నమనేని సుబ్బారావు, పి.కోటేశ్వరరావు,తోట సత్యనారాయణ, మేక ప్రసాద్, పెంటపాడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

అత్తిలి: జీవాత్మ, ఆత్మ, పరమాత్మల వివరాలు తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ ఆరాధనతో ధర్మ స్థాపన జరుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ చెప్పారు. అత్తిలి మండలం ఈడూరు కంచుమర్రు, సగరపేట గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదికకి చెందిన భీమవరం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను గ్రామాల్లో ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంతం భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు నాగేశ్వరరావు, వాసుదేవా, ప్రసాద్, సత్యనారాయణ, గోపి, రాము, మూర్తి, శ్రీకర్, సుందరరావు, హనుమంతరావు, యశోదలక్ష్మి, తారకేశ్వరి, భానుమతి, శ్రీరేఖ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్ ప్రారంభించిన కలెక్టర్


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): కలెక్టరేట్ ఆవరణలో ఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో తాడేరుకు చెందిన ఏసు స్వయం సహాయక సంఘం డ్వాక్రా మహిళలతో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యానికి మేలు చేసే ఆర్గానిక్ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో చేసిన ఐటమ్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టరేట్ శాఖల్లో సమీక్ష సమావేశాలు, చిన్న చిన్న సమావేశాలు జరిగినప్పుడు ఈ క్యాంటీన్ నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి మహిళా సంఘాల సభ్యులకు చేయూతనివ్వాలని అధికారులకు సూచించారు. డీఆర్ డీఏ పీడీ వేణుగోపాల్, సమాచార శాఖ ఏడీ దాసరి నాగార్జున, డ్వామా పీడీ రాజేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి ఎ.దుర్గేష్, సీపీఓ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినుల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

తణుకు టౌన్: కళాశాల స్థాయి విద్య పట్ల అధ్యాపక సిబ్బందితో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల ఏవో డాక్టర్ డీ సుబ్బారావు చెప్పారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ అధ్యక్షత వహించారు. విద్యార్థుల చదువుతో పాటు ఇతర వృత్తి విద్యా కోర్సుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి, విద్యార్థుల తల్లిదండ్రులు జీ అరుణ, ఎం సూర్యకుమారి, తదితరులు మాట్లాడారు.

దళితవాడల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ఆకివీడు: దళిత వాడల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయకోరారు.